క్లుప్తంగా

ఘనంగా శివ ముక్కోటి పూజలు



ప్రత్తిపాడు శివాలయంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులోని శ్రీ గంగాపార్వతీ సమేత దండేశ్వరాలయంలో శివ ముక్కోటి పూజలు ఘనంగా జరిగాయి. ఆరుద్రోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక దేవాలయంలో ఆలయ అర్చకులు పత్తిపాటి పరమేశ్వరశర్మ.. స్వామి వారికి పంచామృత అభిషేకాలు, అమ్మ వారికి కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవతా మూర్తులను దర్శించుకున్నారు. ఆలయ కార్య నిర్వహణాధికారి నరేష్ రెడ్డి స్వామి వారిని దర్శించుకుని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

చెస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్, వైస్ ప్రెసిడెంట్ తదితరులు

చేబ్రోలు: పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ విభాగం జిల్లా స్థాయిలో నిర్వహించిన ఆటల పోటీల్లో చేబ్రోలు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి, బహుమతులు సాధించినట్లు కళాశాల వైస్ ప్రెసిడెంట్ జి.మస్తాన్ చౌదరి శుక్రవారం తెలిపారు. గుంటూరు బీఆర్ స్టేడియంలో జరిగిన చెస్ పోటీలలో ద్వితీయ సంవత్సరం డిప్లమో ఈఈఈ గ్రూపు విద్యార్థి ఎస్.సాయి పవన్‌రెడ్డి ప్రథమ బహుమతి, డిస్క్ త్రోలో డిప్లమో ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఎస్‌కే యూనస్ ఆలీ ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. విజయవాడలో ఫిబ్రవరి నెలలో జరగనున్న స్టేట్ మీట్‌కు ఇరువురు విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు



గాయపడిన వృద్ధురాలిని వైద్యశాలకు తరలిస్తున్న 108 వాహన సిబ్బంది

చేబ్రోలు: రోడ్డు దాటుతున్న వృద్ధురాలు ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గాయపడిన ఘటన చేబ్రోలు గ్రామ శివారులో శుక్రవారం జరిగింది. చేబ్రోలు కొత్తపేటకు చెందిన సిద్దెల శారమ్మ స్థానిక డాన్ బాస్కో స్కూల్ ఎదురుగా రోడ్డు దాటుతున్న క్రమంలో పొన్నూరు వైపు వెళ్తున్న బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శారమ్మ కాలుకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు స్థానికులు తరలించారు.

ప్రాంగణ ఎంపికల్లో 'చలపతి' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తును అందించడం తమ కళాశాల లక్ష్యమని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం నగర శివారులోని లాం నందున్న కళాశాలలో బెంగళూరుకు చెందిన కోడ్ నెస్ట్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాలకు చెందిన 9 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ వైవీ ఆంజనేయులు, సెక్రటరీ సుజిత్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.కిరణ్ తదితరులు అభినందించారు.

చోరీ కేసు నమోదు

పొన్నూరు: ద్విచక్ర వాహనం చోరీపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసుల వివరాలు మేరకు.. మండల పరిధిలోని దొప్పలపూడి గ్రామానికి చెందిన మండె రాఘవులు ఈ నెల 5న తన తల్లికి ఆరోగ్యం బాగలేకపోవటంతో ద్విచక్ర వాహనంపై నిడుబ్రోలు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చారు. బైక్‌ను హాస్పిటల్ బయట వదిలి లోపలకు వెళ్లాడు. వైద్యం చేయించుకొని బయటకు వచ్చేసరికి బైక్ కనపించకపోవడంతో.. పట్టణ పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ బాబి తెలిపారు.

అర్హతే ఆధారంగా పింఛన్లు మంజూరు

- నాకు రాజకీయ భవిష్యత్ కల్పించింది వైఎస్సార్
- ఆయన తనయుడి పార్టీలోనే రాజకీయం జీవితం
- పచ్చ పత్రికలు..పిచ్చి రాతలు మానుకోవాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



మహిళకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే సుచరిత

కాకుమాను: అర్హతే ఆధారంగా కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలు చూడకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు మాజీ మంత్రి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. స్థానిక శ్రీ చెన్నకేశవ దేవస్థాన కల్యాణ మండపంలో శుక్రవారం వైఎస్సార్ పింఛన్ కానుక వారోత్సవాల్లో భాగంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సుచరిత పాల్గొని, మండలంలోని నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సుచరిత మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పేద ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ప్రజా సంకల్ప యాత్రలో జగనన్న చేసిన వాగ్దానాలకు మించి.. ప్రజా పరిపాలన అందిస్తున్న విషయం రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. తనకు రాజకీయ భవిష్యత్తు కల్పించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి అని, అలాంటి మహానేత తనయుడు స్థాపించిన పార్టీలో మొట్ట మొదటిగా ఎమ్మెల్యే పదవికి రాజీనామ చేసి, చేరిన తొలి వ్యక్తిని తానేనని ఆమె తెలిపారు. కొద్ది రోజుల నుంచి సుచరిత కుటుంబం వైఎస్సార్ సీపీ నుంచి వెళ్లిపోతుందని వస్తున్న వార్తలు అవాస్తమని ఖండించారు. తాను రాజకీయాల్లో ఉన్నంత వరకు వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతానని స్పష్టం చేశారు.

పచ్చ పత్రికలు.. పిచ్చి రాతలు మానుకోవాలి

కొద్ది రోజుల నుంచి తనపై పచ్చ పత్రికల్లో పిచ్చి రాతలు, టీవీ చానల్స్‌లో వస్తున్న దుష్ప్రచారాలు మానుకోవాలని ఎమ్మెల్యే సుచరిత ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు రాజకీయ గురువు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని ఆమె తెలిపారు. తాను, తన కుటుంబం రాజకీయాల్లో ఉన్నంత వరకు అన్న జగనన్న స్థాపించిన వైఎస్సార్ సీపీలోనే ఉంటామని గంటాపథంగా చెప్పారు. ఎల్లో మీడియా.. అన్నీ తెలుసుకుని ప్రచారాలు చేయాలని లేదంటే పార్టీ కార్యకర్తల కోపాగ్నికి బలి కావల్సి వస్తుందని సుచరిత హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండల జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు వింతా రాఘవరెడ్డి, ప్రత్తిపాడు ఏఎంసీ చైర్మన్ మెట్టు రాజేశ్వరి, ఆర్‌అండ్‌బీ డైరెక్టర్ పిల్లి మేరి, కార్పొరేటర్ సాంబిరెడ్డి, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ గేరా పున్నారావు, సర్పంచ్ పసుపలేటి శివకుమారి, వక్ఫ్‌బోర్డు జిల్లా డైరెక్టర్ పొన్నూరు షేక్ కలిముల్లా, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఎంపీడీఓ శరత్‌బాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న సీఎం జగన్

పెదనందిపాడు: వైఎస్ జగన్ మోహనరెడ్డి పాద యాత్ర సమయంలో ఇచ్చిన హామీలను నేరవేర్చారని మాజీ మంత్రి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నాగులపాడు వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు కార్యాలయంలో నూతన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పెదనందిపాడు మండలంలో 6,6639 పింఛన్లకు రూ.1,66,58,000లు గతంలో ఇచ్చేవారని, నేడు 194 కొత్త పింఛన్లు వచ్చాయని, వాటిని గాను రూ.1,86,59,750 లు లబ్ధిదారులకు అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ టి.హెప్సిబా, వైస్ ఎంపీపీలు షేక్ ఖాశింబీ, కె.సాంబశివరావు, జడ్పీటీసీ సభ్యురాలు కల్లూరి అన్నపూర్ణ, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు చైర్మన్ మెట్టు రాజేశ్వరి, డైరెక్టర్లు షేక్ ఖాశీం పీరా, కొండా కృష్ణారెడ్డి, అర్ అండ్ బీ రాష్ట్ర డైరెక్టర్ పిల్లి మేరి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దాసరి పద్మారావు, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ జిలానీ, పార్టీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెరుకూరి సాంబశివరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో కె.సాయిలీల తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు: బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. పట్టణంలోని 22వ వార్డులో శుక్రవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులోని సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకుంటూ.. వాటిని త్వరిత గతిన పరిష్కరిస్తామని హామీ ఇస్తూ ముందుకు సాగారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని ప్రభుత్వ పథకాలను నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామ స్వరాజ్యం కోసం ఆనాడు మహాత్మ గాంధీ ఎంతగానో పోరాడారన్నారు. నేడు సీఎం జగన్ సచివాలయాలను తీసుకొచ్చి గాంధీజీ కలలను నిజం చేశారన్నారు. గత పాలకులు మాటలతో కాలయాపన చేశారని విమర్శించారు. పట్టణంలో గత 25 సంవత్సరాలుగా జరగని అభివృద్ధిని గత మూడేళ్లలో చేసి చూపించామన్నారు. రానున్న రోజులలో పట్టణాన్ని అభివృద్ధి చేసి ఆదర్శంగా నిలుపుతామన్నారు.

గ్రావెల్ దాన్ ధూళిపాళ్ల నరేంద్ర

పొన్నూరు నియోజకవర్గంలో గ్రావెల్ డాన్‌గా పేరుపొందిన ధూళిపాళ్ల నరేంద్ర శుక్రవారం చేబ్రోలు మండలంలో అన్ని అనుమతులతో సాగుతున్న గ్రావెల్ తవ్వకాలపై మాట్లాడటం హాస్యస్పదంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. టీడీపీ పాలనలో ధూళిపాళ్ల నరేంద్ర, అతని తమ్ముడు సురేంద్రలు నియోజకవర్గంలో గ్రావెల్ ను అక్రమంగా అడ్డదారిలో తవ్వుకుంది ప్రజలందరికి తెలుసనని అన్నారు. ఏ గ్రామం వెళ్లిన గ్రావెల్ డాన్ ఎవరని ప్రజలను అడిగితే వెంటనే నరేంద్ర, సురేంద్ర పేర్లు చెబుతున్నారని దుయ్యబట్టారు. అక్రమ గ్రావెల్ తవ్వకాలు అడ్డుకున్న వారిపై అక్రమ కేసులు పెట్టింది టీడీపీ నాయకులు కాదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.రాధ, డక్కుమళ్ళ ఏసుపాదం, గోళ్ళమూడి సత్యం, నాగసూరి ప్రతాప్, ఆకులు వెంకటేశ్వరరావు, దాసరి నారాయణరావు, షేక్ సైపుల్లా, షేక్ మాము, గేరా సంజీవ్,రఫీ, పీరు, వట్టిప్రోలు రంగారావు, షేక్ మహమ్మద్, తిరుమలశెట్టి సుధాకర్, గేరా కుమారి, మోపర్తి ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల హై డ్రామా

రాజకీయ లబ్ధి కోసం క్వారీ వద్ద హంగామా

చేబ్రోలు: ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులతో క్వారీలు నిర్వహిస్తున్నప్పటికీ రాజకీయ లబ్ధి కోసం టీడీపీ మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ శుక్రవారం హైడ్రామా నడిపారు. చేబ్రోలు మండలం వీరనాయకునిపాలెంలో అక్రమ మైనింగ్ జరుగుతున్నదని కొంతమంది టీడీపీ నాయకులతో కలిసి అక్కడకు చేరుకొని హడావుడి చేశారు. చేబ్రోలు ఎస్ఐ జి వెంకటాద్రి ఆధ్వర్యంలో పోలీసులు క్వారీ ప్రాంతానికి చేరుకొని ధూళిపాళ్ల నరేంద్రకు నోటీసులు అందించి, అదుపులోకి తీసుకొని చింతలపూడిలోని ఆయన ఇంటి వద్దకు తీసుకువెళ్లి వదిలిపెట్టారు. వీరనాయకునిపాలెం గ్రామంలోని క్వారీ నిర్వాహకులు అధికారుల నుంచి అన్ని అనుమతులు పొందారు. మైనింగ్, రెవెన్యూ, పంచాయతీ అనుమతులతో క్వారీ నడిపిస్తున్నారు. ఇక్కడ అక్రమంగా తవ్వకాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే హడావుడి చేయడంపై గ్రామస్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ ప్రభుత్వంలో క్వారీలుగా...

తెలుగుదేశం ప్రభుత్వ కాలంలో టీడీపీ నేతలు రైల్వే భూములు, జిల్లా పరిషత్ భూములు, చెరువులను క్వారీలుగా మార్చి కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్నారు. అడ్డుకున్న వారిపై అక్రమ కేసులు బనాయించారు. నీరు– చెట్టు పేరుతో ఎటువంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా మండలంలోని వీరనాయకునిపాలెం, శేకూరు, సుద్దపల్లి, శలపాడు, చేబ్రోలు, వడ్లమూడి గ్రామాల్లో అక్రమ క్వారీయింగ్ చేసి వంద కోట్లు రూపాయలు మేర దోచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతాన్ని మర్చిపోయి అన్ని అనుమతులతో క్వారీలు నిర్వహిస్తున్న ప్రాంతంలోకి వచ్చి అడ్డుకునే ప్రయత్నం చేయటంపై టీడీపీ నేతలే పెదవి విరుస్తున్నారు.

బాలకోటేశ్వరస్వామి దేవస్థానానికి నిధులు మంజూరు

చేబ్రోలు: జిల్లాలో ఖ్యాతి గాంచిన వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానం పునఃనిర్మాణానికి నిధులు మంజూరైనట్లు పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానం వద్ద శుక్రవారం ఆలయ పునఃనిర్మాణంపై సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి రూ.1.56కోట్లు అంచనా వేయగా..దేవాదాయధర్మాదాయ శాఖ నుంచి కోటి రూపాయలు నిధులు మంజూరైనట్లు తెలిపారు. మ్యాచింగ్ కంట్రిబ్యూషన్ రూ.56 లక్షలు భక్తుల సహకారంతో దేవాదాయశాఖకు చెల్లించాల్సి ఉందన్నారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయశాఖ ఉన్నతాధికారులు, స్థపతి, డీఈఈ, ఏఈలు, విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరుద్రోత్సవంలో జీఎంసీ కమిషనర్, ఎమ్మెల్యే పూజలు

పెదకాకాని: పెదకాకానిలోని శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం జరిగిన ఆరుద్రోత్సవంలో పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కీర్తి చేకూర్తి పాల్గొన్నారు. ఎమ్మెల్యే, కమిషనర్‌కు దేవస్థాన సహాయ కమిషనర్ ఎస్. శ్రీనివాసరెడ్డి ఆలయ మర్యాదలతో, వేద మంత్రోచ్చరణల మధ్య స్వాగతం పలికారు. దేవాలయంలో ప్రదక్షణల అనంతరం శ్రీ భ్రమరాంబసమేత శ్రీ మల్లేశ్వరస్వామికి సుగంధ ద్రవ్యాలు, పంచామృతంతో ప్రత్యేకంగా నిర్వహించిన మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, గ్రామోత్సవంలో పాల్గొన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన మిద్దె రథంపై శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు మేళ తాళాలతో పెదకాకాని పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవాన్ని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు, అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేద పండితులు, అర్చక స్వాములు వేద ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యకు ఆశీర్వచనాలు అందించారు. ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మిద్దె రథం బహూకరించిన బండ్లమూడి అజయ్ కుమార్, ఉమాదేవి దంపతులు, భక్తులు, గ్రామస్తు గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

అడిగిన వెంటనే సాయం..

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందించిన ఎమ్మెల్యే సుచరిత



గుంటూరు రూరల్: మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతటోటి సుచరిత మరోసాని మానవత్వం చాటుకున్నారు. శుక్రవారం పర్యటనలు ముగించుకుని ఇంటికి వచ్చిన ఎమ్మెల్యేకు కార్యాలయం వద్ద పత్తిపాడు మండలంలోని కొండ్రూపాడు గ్రామం రావిపాటిపాలేనికి చెందిన వాశి మళ్ల శ్యామ్యూల్ అనే దివ్యాంగుడు కనిపించాడు. గమనించిన ఎమ్మెల్యే అతని వద్దకు వెళ్లి పలకరించారు. శ్యామ్యూల్ తన కుటుంబ సభ్యులు వ్యవసాయ కూలి పనులకు వెళ్తుంటారని, తన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సుచరిత తనవంతుగా శ్యామ్యూల్‌కు క్షణాల్లో ట్రై సైకిల్‌ను అందజేశారు. వారి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం, జగనన్నతోపాటు, తాను అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పొన్నూరు: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీస్‌ల వివరాలు మేరకు.. వలసమాల పల్లెకు చెందిన వెంకట శివరావు(55) ఈ నెల 1వ తేదీన పొలం పనులకు నందూరు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో కళ్లు తిరిగి రోడ్డు పై పడటంతో తలకు గాయమైయింది. దీంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ శివరావు మృతి చెందాడు. మృతుడి భార్య వెంకటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భార్గవ్ తెలిపారు.

పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండాలి



దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పొన్నూరు: ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే దోమకాటుకు దూరంగా ఉండాలని వార్డు కన్వీనర్ గేరా సంజీవ్ పేర్కొన్నారు. పట్టణంలోని 23వ వార్డులో శుక్రవారం డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వంతో సమన్వయమై.. చుట్టుపక్కల ప్రాంతాలను పరిశుభ్రంగా పెట్టుకోవాలన్నారు. దోమ కాటు వల్ల బోదకాలు, మలేరియా, చికెన్ గున్యా, డెంగీ జ్వరం, మెదడువాపు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వాటి నివారణకు వైద్యుల సూచనలు తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశ వర్కర్, మిక్కిలి మోహన్‌రావు, వలపర్ల వసంతరావు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

9న 'కౌండిన్య' ఉపకార వేతనాల పంపిణీ



మాట్లాడుతున్న ఈవీ నారాయణ

గుంటూరు ఎడ్యుకేషన్: కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఉపకార వేతన ప్రదానోత్సవం పాటు కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ప్రారంభోత్సవాన్ని ఈనెల 9వ తేదీ నిర్వహించనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈవీ నారాయణ తెలిపారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌ఓ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గౌడ జన సేవా సమితి వ్యవస్థాపక బృందం ఆధ్వర్యంలో పెదకాకాని మండలం వెనిగండ్ల గ్రామ సమీపంలోని కౌండిన్య పురంలో దాతల సహకారంతో నిర్మించిన కౌండిన్య ఐఏఎస్ అకాడమీ భవనాన్ని రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 450 మంది విద్యార్థులకు రూ.18 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. 2006లో కేవలం ముగ్గురు విద్యార్థులకు రూ.10వేలతో ప్రారంభించిన ఉపకార వేతన పంపిణీ కార్యక్రమం ఇప్పటి వరకు ఆరువేల మంది విద్యార్థులకు రూ.1.50 కోట్లు మేరకు అందజేసినట్లు వివరించారు.

చిట్టి తల్లి.. ఏంటిదీ..!



వేడుకుంటున్న ఆదిలక్ష్మి

ప్రత్తిపాడు: నవమాసాలు మోసింది. ఇద్దరు కుమార్తెలకు జన్మనిచ్చింది. పెంచి పెద్దవారిని చేసింది ఒక అయ్య చేతిలో పెట్టింది. భర్త కూడా చేయి విడిచి కానరానిలోకాలకు వెళ్లిపోయాడు. కూతుర్లు కంటికి రెప్పలా చూసుకుంటారనుకున్న ఆ తల్లి ఆశలు అడి ఆశలయ్యాయి. ఉన్న ఒక్క ఇంటిని చిన్న కూతురు లాక్కుని, తనను రోడ్డున పడేసిందని.. చిట్టి తల్లి ఏంటి..నాకు ఈ పరిస్థితి అని బోరున విలపించిన పట్టించుకోలేదని ఆ తల్లి ఆవేదన చెందుతోంది. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన కొత్తా ఆదిలక్ష్మి బాధ ఆమె మాటల్లోనే...ఆదిలక్ష్మికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కూతురు కోటేశ్వరిదేవి, చిన్న కూతురు సుజాతకు ఎప్పుడో వివాహం చేసింది. చిన్న కూతురు ఇల్లు కట్టుకునే వరకు తన వద్దనే ఉంటానని.. ఆదిలక్ష్మి ఇంటికి వచ్చింది. ప్రస్తుతం తల్లి ఇంటినే స్వాధీనం చేసుకుని, ఆమెను ఇంట్లో ఉండనివ్వకుండా వేధింపులకు గురిచేస్తోంది. తన్ని తరిమేసి ఇంటికి తాళాలు వేశారు. దీంతో ఏమి చేయాలో పాలుపోని ఆ తల్లి ఇంటి బయటనే పడుకుంటోంది. తనకు న్యాయం చేసి, నిలువ నీడ కల్పించండి మహా ప్రభో అంటూ సుమారు నెల రోజులుగా ఆ తల్లి పోలీస్ స్టేషను చుట్టూ తిరుగుతోంది. తన ఇల్లు తనకు ఇప్పిస్తే చాలని, ఇంకేమీ వద్దని రెండు చేతులూ జోడించి వేడుకుంటోంది. ఈ విషయంపై ప్రత్తిపాడు ఇన్‌చార్జి ఎస్ఐ ఆరోగ్యరాజును వివరణ కోరగా స్పందించారు. పెద్దావిడ చెప్పిన వెంటనే చిన్న కూతురిని పిలిపించి మాట్లాడామని, ఇంట్లో ఉండేందుకు ఒప్పుకున్నట్లు చెప్పారు. అయితే మళ్లీ తనను కూతురు ఇబ్బంది పెడుతున్నట్లు ఆమె చెబుతోందని, ఈ విషయంపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఈ–క్రాప్‌లో పంట నమోదు చేసుకోవాలి

పెదకాకాని: ప్రకృతి వ్యవసాయం చేసే రైతులందరూ తప్పనిసరిగా ఈ– క్రాప్‌లో పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి సంధ్యారాణి సూచించారు. గోళ్ళమూడి గ్రామ రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం విత్తన శుద్ధిపై రైతులకు ఆమె అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో పెట్టుబడి తక్కువవుతుందని, దిగుబడి పెరుగుతుందని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. రసాయనాలు లేని ఆహారంతో ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆదరించాలని, రైతులు కూడా ఈ పద్ధతిని అవలంభించాలని సూచించారు. జిల్లా అడిషనల్ డీపీఎం జానకి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పండించిన పంటలకు తిరుమల తిరుపతి దేవస్థానం 15 శాతం నగదు అదనంగా ఇస్తున్నట్లు తెలిపారు. మార్క్ ఫెడ్, ఆర్‌వైఎస్ఎస్ అనుబంధంతో రైతు భరోసా కేంద్రం ద్వారా పంట కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ప్రకతి వ్యవసాయం మండల ఇన్‌చార్జ్ గురవయ్య మాట్లాడుతూ బీజామృతంతో విత్తన శుద్ధి చేసుకోవడం వల్ల.. విత్తన తెగుళ్లు, భూమి నుంచి వచ్చే తెగుళ్లను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. వీఏఏ వి.విజయలక్ష్మి, పీఆర్‌పీ జి.నాగరాజు, గ్రామ సచివాలయ వలంటీర్లు, డ్వాక్రా మహిళలు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా శివ ముక్కోటి వేడుకలు

చేబ్రోలు: చేబ్రోలులోని నాగేశ్వరస్వామి, భీమేశ్వర స్వామి దేవస్థానాల్లో శివ ముక్కోటి ఏకాదశి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. గంగాపార్వతి సమేత నాగేశ్వర స్వామి దేవస్థానంలో ఆరుద్రోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఏకాదశి రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. అర్చకుల బృందం సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు.

అధ్యాపకులకు డాక్టరేట్



శ్రీలక్ష్మి కిరణ్మయిని అభినందిస్తున్న చైర్మన్

గుంటూరు రూరల్: తమ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ వడ్లమూడి లక్ష్మీకిరణ్మయికి అనంతపురం జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రధానం చేసినట్లు కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు శుక్రవారం తెలిపారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు గ్రామంలోగల కళాశాలలో ఏర్పాటు అధ్యాపకురాలిని ఈ మేరకు ఆయన అభినందించారు. 'స్టడీస్ ఆన్ ఎట్మాస్ పియరిక్ ఎరోసోల్స్ యాసింగ్ మెడిస్ సెటిలైట్ డేటా ఓవర్ ట్రాఫికల్ రీజియన్ ఇండియా' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ప్రిన్సిపల్ డాక్టర్ బాబు, ఎం బసవేశ్వరరావు తదితరులు అభినందించారు.

చలపతి ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకునికి..

గుంటూరు రూరల్: తమ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ కేతిపల్లి రవికి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రధానం చేసిందని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ శుక్రవారం తెలిపారు. లాం నందున్న చలపతి ఇంజినీరింగ్‌కళాశాలలో అధ్యాపకుడిని ఈ మేరకు అభినందించారు. 'ఐసోలేషన్ స్క్రినింగ్ అండ్ అప్టిమైజేషన్ ఆఫ్ ఫంగల్ గెలాక్టోమూరినేజ్' అనే అంశంపై ప్రొఫెసర్ మల్లికార్జునరావు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు రవికి డాక్టరేట్ లభించిందన్నారు. విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు, సెక్రటరీ సుజిత్, డాక్టర్ రాధాకృష్ణమూర్తి అభినందించారు.

హెల్త్ క్లినిక్‌లను సందర్శించిన బిహార్ వైద్య బృందం



చేబ్రోలు పీహెచ్‌సీ వద్ద బిహార్‌కు చెందిన వైద్య బృందం

చేబ్రోలు: గ్రామీణ ప్రాంతాల్లో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ద్వారా అందుతున్న వైద్య సేవలను బిహార్‌కు చెందిన వైద్య బృందం శుక్రవారం పరిశీలించింది. బిహార్ హెల్త్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ ఆఫ్ చీఫ్ డాక్టర్ సునిల్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ మనీష్ రంజన్, సీనియర్ అడ్వయిజర్ అడిషనల్ చీఫ్ హేమంత్‌షా, ప్రోగ్రాం మేనేజ్ మెంట్ అండ్ కన్సల్టెంట్ తన్మయి కొడాలి తదితరులతో కూడిన బృందం వేజండ్ల, చేబ్రోలు పీహెచ్‌సీలను సందర్శించి, వివిధ అంశాలను నమోదు చేసుకున్నారు. ఏపీ వైద్య ఆరోగ్య శాఖలో అమలవుతున్న కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ద్వారా 64 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు అందుతున్నట్లు తెలుసుకున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు వైద్య సేవలు, పాఠశాల విద్యార్థులు, అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు అందుతున్న వైద్య సేవలపై సంతప్తి వ్యక్తం చేశారు. ఇక్కడ అందుతున్న వైద్య సేవల నివేదికను బిహార్ రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసి, అక్కడ అమలు చేయడానికి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసినట్లు అధికారులు తెలిపారు. వీరి వెంట డీఎం అండ్ హెచ్‌వో సుమయాఖాన్, తెనాలి డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో అన్నపూర్ణ, ఎన్‌హెచ్‌ఎం డీపీవో సైమన్ స్టేట్ నోడల్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యం, కో–ఆర్డినేటర్ శ్రావణ్‌బాబు, స్థానిక వైద్యాధికారి అబ్రహం లింకన్, సిరాజుద్దీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో విజిలెన్స్ తనిఖీలు

పెదనందిపాడు: పెదనందిపాడు పీహెచ్‌సీలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ ఏజీ ఎన్.ప్రసాదు తన సిబ్బందితో మందుల లభ్యత, రికార్డులు, సిబ్బంది సమయపాలపై తనిఖీ చేశారు. ఈ తనిఖీపై నివేదికలు తయారు చేసి ఉన్నాతాధికారులకు ఇవ్వనున్నట్లు వారు చెప్పారు. వైద్యాధికారి విజయ రత్నకుమార్ అందుబాటులో ఉన్నట్లు వారు తెలిపారు. విజిలెన్స్ ఏఓ జె.వాసంతి, డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అష్రాప్ తాజిన్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.